క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ మహరాజన్, తదితరులు

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి జంక్షన్‌కు సమీపంలోని జాతీయ రహదారి–26కు పక్కన వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులు, ప్రజలకు దాహార్తి తీర్చేందుకు వ్యవవశాయ శాఖ ఈ చలివేంద్రం ఏర్పాటు చేసింద ని చెప్పారు. వేసవి పూర్తయ్యేంత వరకు చలివేంద్రాన్ని కొనసాగించాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావుకు సూచించారు. కార్యక్రమంలో గరుడుబి ల్లి రైతు భరోసా కేంద్రం సిబ్బంది,పలువురు రైతులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం



భోజనాలు చేస్తున్న విద్యార్థులు

బొండపల్లి: ఒంపల్లి గ్రామంలోని అనాథ ఆశ్రమంలో 150 మంది విద్యార్థులకు పురిటిపెంట మామిడిబంద కాలనీకి చెందిన పిళ్లా గోపి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి అన్నదానం చేశారు. పిళ్లా తులసీరాం,ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



వంటకాలను రుచి చూస్తున్న ఎంఈఓ–2 సాయిచక్రధర్

గజపతినగరం: మండల కేంద్రంలోని పురిటిపెంట బాలుర హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాలను ఎంఈఓ–2 సాయిచక్రధర్ గురువారం పరిశీలించారు. వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఉపాధ్యాయుల విద్యా బోధన ఎలా చేస్తున్నారు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఆయన వెంట హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వరరావు, సీఆర్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తవలస: స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. కోర్టులో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని న్యాయవాదులు గురువారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సీనియర్ న్యాయవాది డి.వి.ఎల్.దేవి, వైస్ ప్రెసిడెంట్‌గా కె.అచ్చిబాబు, కార్యదర్శిగా డి.శ్రీనివాసరావు, ఉప కార్యదర్శిగా గవర కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బోజింకి సన్యాసిరావు, మల్ల రాము, జి.పి.లత, కృష్ణం నాయుడు, సీహెచ్.సతీష్ ఎన్నికయ్యారు.

శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజలు చేస్తున్న గ్రామపెద్దలు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు

కొత్తవలస: రామలింగాపురం గ్రామంలో శివాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన న్యాయవాది ఓ.వి.మురళీకృష్ణ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో గురువారం శంకుస్థాపన చేశారు. వేదపండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ప్రత్యేకపూజలు చేయించారు. రూ.16 లక్షల అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణానికి న్యాయవాది మురళీకృష్ణ ముందుకు వచ్చారని గ్రామపెద్దలు చెప్పారు. , రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, సర్పంచ్ నెక్కల గౌరినాయుడు, గ్రామ పెద్దలు కోళ్ల శ్రీను పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని వెల్దాం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, టీచర్ల లెసెన్ ప్లాన్, మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీ లించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

మళ్లీ జగన్ ప్రభంజనం ఖాయం



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, వేదికపై ఎమ్మెల్యే కడుబండి, తదితరులు

- దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి చేశాం
- చంద్రబాబు దుర్మార్గ ఆలోచన వల్లే పింఛన్‌దారులకు అవస్థలు
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ

లక్కవరపుకోట: దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమప్రాధాన్యం ఇచ్చారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ సమీపంలోని వెంకటసాయి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ అధ్యక్షతన పార్టీ మండల స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈసంద ర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ జగన్ ప్రభంజనం ఖాయమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో, పరిపాలనలో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేశారన్నారు. పేదల కోసం పరిత పించే జగన్ మరోమారు ముఖ్యమంత్రి కావడం చారిత్రాకఅవసరమని అన్నారు. పేదలు, సామాన్యులంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకి చులకన భావమని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు దుర్మార్గంగా వ్యవహరించి, తన అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి పేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులకు ఇళ్ల వద్ద వలంటీర్ల ద్వారా పింఛన్ అందకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. పేదలు బాగుంటే ఆయన చూసి ఓర్వలేరని అన్నారు. టీడీపీని స్థాపించిన ఎన్.టి.రామారావు ఆశయాలకు భిన్నంగా చంద్రబాబు వ్యవహరిస్తూ పార్టీలో సామాన్యులకు మనుగుడు లేకుండా చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీలో పనిచేసే ప్రతి కార్యకర్త,నాయకుడికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో విశాఖప ట్నం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎస్.కోట ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న కడుబండి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ మరోమారు జగన్‌ని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు కార్యకర్తలు,నాయకులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ,డీసీబీసీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు,ఎల్.కోట, వేపాడ జెడ్పీటీసీలు తూర్పాటి వరలక్ష్మి, ఎస్.అప్పారావు, ఎల్.కోట, కొత్తవలస మండలాల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు యడ్ల కిశోర్,బొంతల వెంకటరావు, వైస్ ఎంపీపీలు ఎం.శ్రీనురాజు,ఆవాల శ్యామల, పార్టీ ఎల్.కోట మండల యువజన విభాగం అధ్యక్షుడు తూర్పాటి అప్పలరాజు, సీనియర్ నాయకులు కూరాకుల సూర్యారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,నాయుకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

సంక్షేమ సారథి సీఎం జగన్



పెదమానాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, నాయకులు

- సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: పేదల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. మండలంలోని పెదమానాపురం, దాసరిపేట గ్రామాల్లో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెదమానాపురం చర్చిలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఇచ్చిన హామీలను నెరవేర్చి సీఎం జగన్ జనరంజక పాలన చేశారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని అన్నారు.

రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గజపతినగరం ఎమ్మెల్యేగా తనను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఎమ్మెల్యే తనయుడు బొత్స గురునాయుడు, సర్పంచ్‌లు గొటివాడ దాసు, పాడుపురెడ్డి సత్యం, ఎంపీటీసీ గొటివాడ కన్నయ్య, సీనియర్ నాయకుడు కనిమొరక తిరుపతి, ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు,మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల:

మండలంలోని పాలవలస ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆ ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్‌శాఖ జిల్లా ఏఈ పి.హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గూడెం, పాలవలస, పకీరుకిట్టాలి, బూర్లిపేట, కొండగంట్రేడు, ముద్దాడపేట, మునకాల పేట, కోటగంట్రేడు, నక్కలపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమా వేశం గురువారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అభివృద్ధి పనులతో పాటు, సమస్యలపై చర్చించడానికి అవకాశం లేదని ఎంపీపీ తెలిపారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉన్నందున ఈసమావేశం నిర్వహించామని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నిర్వహించే సమావేశంలో అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, మండల పరిషత్ కార్యాలయ ఏఓ డి.వెంకటరమణ, 16 మంది ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వసంత నవరాత్రులు



జామిలో సమావేశమైన సమరసతసేవా ఫౌండేషన్ సభ్యులు

జామి: మండలంలోని అన్ని రామాలయాల్లో శుక్రవారం నుంచి వసంత నవరాత్రులు నిర్వహించాలని సమరసత సేవాఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ భవాని సూచించారు. మండల కేంద్రంలోని రామాలయంలో సమరసత సేవాఫౌండేషన్ అధ్యక్షుడు మట్ట జనార్దన ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. రామాలయాల్లో తొమ్మిది రోజుల పాటు చేయాల్సిన పూజలు, ఇతర కార్యక్రమాలను ధర్మ ప్రచారక్ భవాని సభ్యులకు వివరించారు. మండల సహ సంయోజక్ రొబ్బి సూర్యారావు, పోలరాజు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత వద్ద జాతీయ రహదారి–26పై పెదమానాపురం ఎస్‌ఐ శిరీష్, పోలీస్ సిబ్బంది గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో తరలిస్తున్న వస్తువులు, ఇతర సామగ్రిని క్షుణ్నంగా పరిశీలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహనాల్లో పెద్ద ఎత్తున సరుకులు, వస్తువులు, ఇతర సామగ్రి సరఫరా చేసేటప్పుడు వాటికి సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా ఉండాలని వాహనచోదకులకు సూచించారు.వివిధ అవసరాల కోసం నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన కారణాలు తెలియ జేయడంతో పాటు పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

వేపాడ: మండలంలోని వావిలపాడు, వెల్దాం, వీలుపర్తి, వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో పోలీసులు కేంద్ర బలగాలు ఎస్.కోట రూరల్ సీఐ ఉపేంద్ర, వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ నేతృత్వంలో గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయని, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.



వేపాడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జనరంజక పాలన అందించాం.. ఆదరించండి



చోడవరంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, వేదికపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన తదితరులు

- ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స సత్యనారాయణ

గుర్ల: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందించారని, గ్రామాల్లో చేసిన అభివృద్ధి, పథకాల ద్వారా ఇంటింటికీ చేసిన మేలును గుర్తించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయా లని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రజలను కోరారు. మండలంలోని చోడవరంలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేసిన పథకాల వల్ల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించారని, మహిళలకు గౌరవం పెంచామన్నారు. పేదలు ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం చేయిం చుకునేందుకు గతంలో ఉన్న రూ.5 లక్షల వ్యయపరిమితిని రూ.25 లక్షలకు పెంచామని చెప్పారు. లంచాలు, అవినీతికి తావులేకుండా పథకాలకు సంబంధించిన డబ్బులను నేరుగా లబ్ధిదా రుల ఖాతాలోకి జమ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.మరో అవకాశం ఇస్తే గ్రామాలను రెండింతల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లోకి టీడీపీ నాయకులు వస్తారని, లేని పోని హామీలు ఇచ్చి మభ్యపెట్టేందుకు చూస్తారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఫ్యానుగుర్తుపై ఓటు వేసి చీపురుపల్లి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ చిన్నారులు నుంచి వృద్ధుల వరకు అంద రికీ సంక్షేమం అందించిన సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, యువనాయకులు బొత్స సందీప్ , జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్లు బెల్లాన బంగారునాయుడు , వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, నాయకులు తిరుమరెడ్డి సురే ష్, తిరుమరెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

చంద్రబాబువి నీచరాజకీయాలు

- పింఛన్ల కోసం వృద్ధులు మళ్లీ రోడ్డెక్కాల్సి వచ్చింది
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి



తలారి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: కళ్లు, కాళ్లు లేనోళ్లు, బధిరులు, మంచానపడి ఉన్న రోగులతో రాజకీయం చేసే నీచ రాజకీయ నాయకుడు చంద్రబాబునాయుడు అంటూ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చంద్రబాబు అండ్ కో పై నిప్పులు చెరిగారు. గురువారం రాత్రి గోపాలపల్లి, తలారి, ఉసిరి, చుక్కపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోపాలపల్లిలో ఎమ్మెల్యే కడుబండికి గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. బ్యాండు మేళం, కోలాటాలు, చిరతలతో, పూలజల్లుతో గ్రామంలోకి స్వాగతించారు.

మంచి జరిగిందనిపిస్తేనే ఓటేయండి

గోపాలపల్లి ప్రచారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోజు చూశారా.. పింఛన్లు పంపిణీకి వలంటీర్లు వద్దని ఫిర్యాదులు చేసి, మళ్లీ వృద్ధులు, దివ్యాంగులను రో డ్డు మీదికి లాగిన ఘనుడు చంద్రబాబు అన్నారు. మండిపోయే ఎండల్లో బయటికొచ్చే వృద్ధులు, రోగులు, అనాథలు, అభాగ్యులకు ఏదైనా ప్రమాదం బారిన పడితే చంద్రబాబు ఆదుకుంటాడా అన్ని ప్రశ్నించారు. పింఛన్లు వలంటీర్లు ఇస్తే, మళ్లీ ఓట్లు జగన్‌కే వేసేస్తారన్న భయంతో చంద్రబాబు పన్నిన కుట్రకు నేడు ప్రజ లు మళ్లీ రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందాయని. జగనన్న గతంలో ఎవ్వరూ చేయని తీరుగా ప్రభుత్వాన్ని గడప వద్దకు తెచ్చారన్నారు. మీకు మంచి జరిగిందని పిస్తేనే ఓటేయండని ప్రజలను నిజాయితీగా అడిగే దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. కళ్లబొల్లి మాటలు చెప్పి, అధికారం కోసం సిగ్గూ లేకుండా జట్లు కట్టి వస్తున్న కూటమి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. జనం కోసం నిలబడ్డ జగ న్ వస్తేనే సంక్షేమం కొనసాగుతుందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎస్.కోట ఎమ్మెల్యేగా తనను, విశాఖప ట్నం ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. స్టేట్‌ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, తలారి, పోతనాపల్లి, మామిడిపల్లి సర్పంచ్‌లు రంధి అరుంధతి, కె.వెంకటరావు, సీహెచ్. రమణ, ఎంపీటీసీ సన్యాసప్పడు, నాయకులు తగరంపూడి రమణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ వి.సతీష్, పలువురు నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొర్లాం సర్పంచ్ మృతి



వెంకటరమణమ్మ (ఫైల్)

గంట్యాడ: మండలంలోని కొర్లాం గ్రామ సర్పంచ్ చప్ప వెంకటరమణమ్మ (72) గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వెంకటరమణమ్మకు సుగర్ లెవల్స్ తగ్గాయని గురువారం ఉదయం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకువచ్చే శారు. మధ్యాహ్నం భోజనం చేసి నిద్రపోయిన ఆమె సాయంత్రం వరకు లేవలేదు. ఆరోగ్యం బాగోలేక నిద్రనుంచి లేవలేదని కుటుంబ సభ్యులు అనుకు న్నారు. సాయంత్రం 6:30 గంటలకు కుటుంబ సభ్యులు ఆమెను లేపడానికి ప్రయత్నించగా లేవకపోవడంతో మృతి చెందారని నిర్ధారించుకున్నారు. నిద్రలో గుండెపోటు వచ్చి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఈమె భర్త చప్ప బుల్లిబాబు సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పనిచేశారు. ఆయన మరణించిన తర్వాత 2021లో సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీచేసి వెంకటరమణమ్మ గెలుపొందారు.

చేసిన మేలును వివరిద్దాం..



గంట్యాడ: నాయకులతో సమావేశమైన నరసింహమూర్తి, జైహింద్‌కుమార్



దత్తిరాజేరు: విజయరాంపురంలో యువతకు దిశానిర్దేశం చేస్తున్న దత్తి చిరంజీవి

గంట్యాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా ప్రతి ఇంటికీ జరిగిన మేలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. పొల్లంకి, పెంటశ్రీరాంపురం, బురదపాడు, మోకాలు పాడు గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగించారని, ఇంటింటికీ వెళ్లి ఈ విషయం ప్రజలకు వివరించి, వారి మద్దతు కోరాలని సూచించారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, నాయకులు కరక మహేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

దత్తిరాజేరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా యువకార్యకర్తలు పని చేయాలని పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు దత్తి చిరంజీవి కోరారు. విజయరాంపురం,శికారుగంజి గ్రామాల్లో యువకులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ ఐదేళ్లలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు.

పింఛన్ కోసం నిరీక్షణ



ఎస్.కోట ఎంపీడీఓ కార్యాలయం వద్ద బారులు తీరిన పింఛన్‌దారులు



గుర్ల మండలంలోని లవిడాం పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ కోసం వేచివున్న వృద్ధులు



కొత్తవలస సచివాలయంలో ఫించన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు



ఎస్.కోటలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



జామిలో నిరీక్షిస్తున్న వృద్ధులు



బొండపల్లి మండలం బిల్లలవలసలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్దకు పింఛన్ పంపిణీ చేయకుండా చంద్రబాబునాయుడు అండ్ కో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారు. ఈనెల పింఛన్ డబ్బులను లబ్ధిదారులకు సచివాలయాల వద్ద పంపిణీ చేశారు. పింఛన్ డబ్బుల కోసం దివ్యాంగులు, వృద్ధులు,మానసిక వికలాంగులు, అంధులు, బధిరులు, మండుటెండలో సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఐదేళ్ల క్రితం నాటి పాలనలో ఎలాంటి కష్టాలు పడ్డామో , మళ్లీ అవేకష్టాలు చంద్రబాబు తీరు వల్లే వచ్చాయని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తూ చంద్రబాబుకు శాపనార్థాలు పెట్టారు. పింఛన్ల పంపిణీ గురువారం నాటికొ గుర్ల మండలంలో 88శాతం, దత్తిరాజేరులో 85 శాతం, ఎల్.కోట మండలంలో 85శాతం, కొత్తవలస మండలంలో 90.67 శాతం బొండపల్లి మండలంలో 91 శాతం పూర్తయిందని ఆయా మండలాల ఎంపీడీఓలు తెలిపారు.

– శృంగవరపుకోట/గుర్ల/జామి: దత్తిరాజేరు /కొత్తవలస/లక్కవరపుకోట/బొండపల్లి